## 18. నాటకం

తెలుగు సాహిత్యం లో గల ప్రక్రియల్లో నాటకం సమున్నత స్థానాన్ని ఆక్రమించింది. ప్రజలకు వినోదాన్ని అందించడమే కాకుండా ప్రబోధాన్ని కూడా కలిగించింది.

భరత మహర్షి "నాటకం యశస్సును కలిగించి ఆయుష్షును పెంచి, హితం కలిగించి, బుద్ధివికాసానికి కారణం అవుతుంది" అని వివరించారు. లలిత కళలు గా పిలువబడుతున్న కవిత్వం, సంగీతం, శిల్పం, చిత్రకళ తోపాటు రంగస్థలంపై ప్రదర్శింపబడుతున్న అద్భుతమైన కళ ఈ నాటకం. నాటకం కర్త సామాజిక స్పృహ కలిగి ప్రజలను చైతన్యవంతులను చేస్తాడు. అందువల్లనే విశ్వసాహిత్యంలో నాటకం విశిష్ట స్థానాన్ని పొందింది. "కావ్యేషు నాటకం రమ్యమ్" "నాటకాంతంహి సాహిత్యమ్" అని చెప్పడం వల్ల నాటకం యొక్క ప్రాముఖ్యం స్పష్టమవుతోంది.

పాశ్చాత్య సాహిత్య ప్రభావంతో భారతీయులకు వారి భాషల్లో నాటకాలు రాయాలనే ఆలోచన, ఆకాంక్ష కలిగింది.

భారతీయులు సంస్కృత నాటకాలను తెలుగులో రాసి ప్రదర్శించారు. తెలుగు నాటకం 19వ శతాబ్దం ఉత్తరార్థంలో రచింపబడి ప్రదర్శనకు నోచుకుంది .తెలుగులో కోరాడ రామచంద్రశాస్త్రి గారు 1860లో రాసిన మంజరి "మధుకరీయం" మొదటి నాటకం .తరువాత సంస్కృత, ఆంధ్ర నాటకాల అనువాదాలు వచ్చాయి. 1972లో కొక్కొండ వెంకటరత్నం గారు "నరకాసుర విజయ వ్యాయోగం" అనే సంస్కృత నాటకాన్ని అనువాదం చేశారు .1874లో వావిలాల వాసుదేవశాస్త్రి షేక్స్పియర్ రాసిన 'జూలియస్ సీజర్' నాటకాన్ని అనువదించారు. వావిలాల వారు 1880లో "నందకరాజ్యం" అనే స్వతంత్ర నాటకాన్ని రచించారు .కందుకూరి వీరేశ లింగం పంతులు గారు "చమత్కార రత్నావళి" తో పాటు అనేక అనువాదాలు రాశారు. అనేక నాటకాలు అనువాదాలు చేసి తెలుగు నాటక సాహిత్యాన్ని సుసంపన్నం చేశారు.

ధర్మవరం కృష్ణమాచార్యులు , కోలాచలం శ్రీనివాసరావులు ప్రసిద్ధ నాటక కర్తగా పేరుపొందారు. ధర్మవరం

వారి ప్రసిద్ధ నాటకం "చిత్రనళీయం". 1897 సంవత్సరం తెలుగు నాటక చరిత్రలో ఒక అద్భుత ఘట్టం గా చెప్పవచ్చు. గురజాడ అప్పారావు గారి కన్యాశుల్కం, వేదం వెంకటరాయ శాస్త్రి గారి "ప్రతాపరుద్రీయం", పానుగంటి లక్ష్మీనరసింహం గారి రాధాకృష్ణ, పాదుకాపట్టాభిషేకం, విప్రనారాయణ , కంఠాభరణం మొదలైన నాటకాలు, బలిజేపల్లి లక్ష్మీకాంతం గారి హరిశ్చంద్ర, చిలకమర్తివారి గయోపాఖ్యానం, తిరుపతి వేంకట కవుల పాండవోద్యోగ విజయం ప్రసిద్ధిపొందాయి.

నాటకాలను రాజకీయ, పౌరాణిక, చారిత్రక ,సాంఘిక నాటకాలు అని వర్గీకరించవచ్చు . జాస్తి వెంకట నరసయ్య గారు రాసి "కాంగ్రెస్ విజయం", యడ్లవల్లి కోటయ్య గారి గాంధేయ విజయం మొదలైనవి రాజకీయ నాటకాలు గా చెప్పవచ్చు. మల్లాది అచ్యుతరామ శాస్త్రి గారి సక్కుబాయి, కొప్పరపు సుబ్బారావు గారు రాసిన తారాశశాంకం మొదలైనవి పౌరాణిక నాటకాలు. ఆత్రేయ గారి గౌతమ బుద్ధ, అశోక్ సామ్రాట్ ఊటూరి సత్యనారాయణ గారి చత్రపతి శివాజీ, అనార్కలి మొదలైనవి చారిత్రక నాటకాలు. వేదాంత కవి గారి కష్టకాలం, ఆకలి మంట,

విశ్వస్వ రాజ్యం, గొల్లపూడి మారుతి రావు గారు రాసిన రాగరాగిణి మొదలైనవి సాంఘిక నాటకాలుగా చెప్పవచ్చు.

1981- 2000 మధ్య కాలంలో వాస్తవానికి ,సమాజానికి దర్పణమైన సాంఘిక ఇతివృత్తాలు ప్రాధాన్యం వహించాయి. పాశ్చాత్య నాటక ప్రభావంతో తెలుగు నాటకంలో ప్రతీకవాదం, అభివ్యక్తి వాదం, అస్తిత్వవాదం, మార్క్సిజం మొదలైన అనేక దృక్పథాలు వచ్చాయి. నాటకరంగాన్ని ప్రజల వద్దకు తీసుకు వెళ్లడంతో ఆధునిక వీధి నాటకం అత్యంత ప్రయోజనాన్ని సాధించింది .అరుణోదయ ప్రింటర్స్ వారి "కరువు బతుకులు" మంచి ఉదాహరణగా చెప్పవచ్చు.

తెలుగు నాటకరంగాన్ని రక్షించే ఉద్దేశంతో 1999వ సంవత్సరం నుంచి ప్రతి సంవత్సరం నంది అవార్డులను ప్రదానం చేయడం ప్రారంభించారు. ఇది శుభసూచకం.

నాటకాభిమానులు నాటక రంగ అభివృద్ధికి ఆర్థికంగా, హార్దిక సహాయ సహకారాలు అందించాలి. అప్పుడే నాటక రంగం అభివృద్ధి పథంలో నడుస్తుంది.

తెలుగు నాటకరంగం ఇతర భారతీయ భాషా నాటకాలతో ఏ మాత్రం తీసిపోదు. సమకాలీన సమస్యలను నాటకం ఇతివృత్తాలుగా స్వీకరించడంలో తెలుగు నాటకం ఎప్పుడూ ముందంజలో ఉంటుంది. కాబట్టి భారతీయ నాటక రంగానికి ప్రజలు ఎప్పుడూ జై కొడుతూనే ఉంటారు.